క్లుప్తంగా

మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి


కాచిగూడ డిపో మేనేజర్ రఘు

కాచిగూడ: ఆర్టీసీ ప్రయాణికులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేయనున్నట్లు కాచిగూడ డిపో మేనేజర్ రఘు ప్రకటించారు. ఆర్టీసీ కాచిగూడ డిపో మేనేజర్‌గా శుక్రవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. హయత్‌నగర్ -1 డిపో నుంచి బదిలీపై కాచిగూడ డిపోకు మేనేజర్ రఘు వచ్చారు. డిపో సిబ్బంది, అధికారులు నూతన డిపో మేనేజర్‌ను కలిసి అభినందించారు.

బీఆర్ఎస్‌లో చేరికలు



అంబర్‌పేట్: బాగ్ అంబర్‌పేటకు చెందిన పలువురు బీజేపీ నేతలు, ఇతర పార్టీల నాయకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను గత ఐదేళ్లలో కోట్లాది రూపాయలతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టానన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేశానన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్పొరేటర్ పద్మ, నాయకులు వెంకట్‌రెడ్డి, గెల్వయ్య, శ్రీరాములు ముదిరాజ్, నర్సింహరెడ్డి, చందు ఉన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు


నాట్య కళాకారులతో శ్రీనివాస్

చిక్కడపల్లి: శ్రీ వాగ్దేవి నాట్య స్థల్ కూచిపూడి విద్యాలయం వార్షికోత్సవం వైభవంగా జరిగింది. శుక్రవారం త్యాగరాయగానసభలో జరిగిన సంస్థ వార్షికోత్సవంలో చిన్నారి కళాకారులు తమ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అతిథిగా హాజరైన తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ.. పిల్లలు చదువుతోపాటు లలితకళల్లో రాణించాలంటే తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. గౌరీశంకర్, శైలజ, శివాజీ, విజయలక్ష్మి, మోహన్ పాల్గొన్నారు.

22న ప్రతిభా పురస్కారాల ప్రదానం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: కళాదర్బార్ ఆధ్వర్యంలో ఈనెల 22న త్యాగరాయగానసభలో ప్రతిభాపురస్కారాల ప్రదానం, స్వర గానామృతం సినీ సంగీత విభావరి జరగనుందని నిర్వాహకులు పాతూరి రంగారావు ప్రకటించారు. శుక్రవారం ఈ సందర్భంగా బ్రోచర్‌ను ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ.. వివిధ రంగాల వారికి సంగీత సేవారత్న, గానరత్న, స్వరరత్న పురస్కారాలను ప్రభుత్వ సలహాదారు రమణాచారి, సినీనటులు సుమన్ ప్రదానం చేస్తారని వివరించారు. సురేఖమూర్తి, శశికళాస్వామి పాల్గొన్నారు.

ఎన్నికల తరువాతే ప్రభుత్వ ఫలాలు !


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహాలక్ష్మి

కాచిగూడ: రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ఉన్నందువల్ల ప్రభుత్వం నుంచి కొత్తగా రావాల్సిన బెనిఫిట్స్ ఎన్నికల తర్వాతనే వస్తాయని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి తెలిపారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని వెంకటస్వామినగర్‌లో ఆమె పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో డ్రైనేజీ సమస్య ఉండటంతో సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. బీజేపీ నేతలు మహేష్, మల్లేష్, జక్కి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాచిగూడ: రైలు ఢీకొని గాయపడిన ఓ వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ వీఎల్ చారి తెలిపిన వివరాల ప్రకారం... కడప ప్రాంతానికి చెందిన ఓబులేష్ కుమారుడు పవన్‌కుమార్ (26) మలక్‌పేట - కాచిగూడ రైల్వే స్టేషన్ల మధ్య పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా.. రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుడిని స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

వాడ వాడలా బతుకమ్మ సంబురం


బతుకమ్మ సన్నాహక సమావేశంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



బతుకమ్మ వేడుకలో హైమావతి పాఠశాల విద్యార్థులు

అంబర్‌పేట్: కేంద్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేసిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఛే నంబర్ చౌరస్తాలో ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన మహిళ చైతన్య సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. దశాబ్దాల తరబడి పెండింగ్‌లో ఉన్న మహిళ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని కేంద్రమంత్రి పేర్కొన్నారు. ఈ నెల 20న అంబర్‌పేట మున్సిపల్‌గ్రౌండ్‌లో జరగనున్న బతుకమ్మ సంబరాలను విజయవంతం చేయాలన్నారు. బతుకమ్మ సంబరాలను తెలంగాణ సంస్కృతి సాంప్రదాయలకు ప్రతీక అని ఆయన కొనియాడారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, అమృత, సినీనటి కస్తూరి, బీజేపీ మహిళా నేతలు గీతామూర్తి, శిరిషా, జ్యోతి, మంత్రి కళావతి, నాయకులు అజయ్‌కుమార్, రవీందర్‌గౌడ్ తదితరులున్నారు.

- విద్యార్థులు బతుకమ్మ సంబరాలను సంబురంగా నిర్వహించుకున్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో హైమావతి పాఠశాలలో విద్యార్థులు బతుకమ్మ వేడుకలను ఆట, పాటలతో హోరెత్తించారు. పాఠశాల కరస్పాండెంట్ హైమావతి ప్రిన్సిపాల్ నిరంజన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
- నల్లకుంటలోని శ్రీ విద్య సెకండరీ స్కూల్‌లో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, విద్యార్థులు ఆట, పాటలతో హోరెత్తించారు. బతుకమ్మ రావమ్మా..బంగారు భవిష్యత్తును ఇవ్వమ్మా..అంటూ.. పాడుతూ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు బతుకమ్మ వేడుకల్లో సందడి చేశారు.



నల్లకుంట శ్రీ విద్య సెకండరీ స్కూల్‌లో..

నేడు బతుకమ్మ చౌక్‌లో అఖిల పక్షం ఆధ్వర్యంలో..

ముషీరాబాద్: గత 8 ఏళ్లుగా అడిక్‌మెట్ డివిజన్ అఖిల పక్షం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్న బతుకమ్మ సంబరాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహిస్తున్నట్లు అఖిల పక్ష నాయకులు ప్రకటించారు. శుక్రవారం రాంనగర్ మీసేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కొండపల్లి మాధవ్, నేత శ్రీనివాస్, శ్యామ్‌సుందర్, డివిజన్ అధ్యక్షులు బల్లా శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ అస్లాం, కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్ యాదవ్, సురేష్, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్‌లు మాట్లాడారు. ప్రతి ఏడాది లాగే ఈసారి కూడా బతుకమ్మ పేర్చి తీసుకొచ్చిన మహిళలకు కూపన్‌లను అందజేసి లక్కీ డ్రా ఈనెల 29న తీయబడుతుందని తెలిపారు. మహిళలందరూ ఈ చిన్న బతుకమ్మ, పెద్ద బతుకమ్మ ఉత్సవాల్లో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు.

టీఎస్‌డీఎఫ్ ప్యానల్ ఆధ్వర్యంలో బ్రోచర్ విడుదల


రాష్ట్ర వైద్యుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ పల్లం ప్రవీణ్ తదితరులు

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌కు జరుగుతున్న ఎన్నికల్లో రాష్ట్ర వైద్యుల ఫోరం (టీఎస్‌డీఎఫ్) ప్యానల్‌ను గెలిపిస్తే వైద్య రంగంలో పెనుమార్పులు తీసుకొచ్చి ఆరోగ్య తెలంగాణ కోసం కృషి చేస్తామని టీఎస్‌డీఎఫ్ అధ్యక్షుడు డాక్టర్ పల్లం ప్రవీణ్, గట్టు శ్రీనివాసులు, చీమ శ్రీనివాస్, లింగంగౌడ్ తెలిపారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికల బ్యాలెట్ బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెడికల్ కౌన్సిల్‌కు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఎన్నికలు జరుగుతాయని, రాష్ట్రంలో ఉన్న ప్రతీ వైద్యుడు ఈ ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. తమను గెలిపిస్తే ఆధునిక వసతులతో నూతన తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ భవనాన్ని నిర్మిస్తామని, నకిలీ వైద్య (ఆర్ఎంపీ, పీఎంపీ) వ్యవస్థను అరికడతామన్నారు. పేద ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్యసేవలు అందేలా కృషి చేస్తామని వివరించారు. రాష్ట్ర ఉద్యమంలో ఫోరం సభ్యులందరూ కీలకపాత్ర పోషించారన్నారు. డాక్టర్ లింగంగౌడ్, చీమ శ్రీనివాస్, సీఆర్‌కే ప్రసాద్, ఆవుల మురళీధర్, పీ.వీ.సత్యనారాయణ, గోంగూర వెంకటేశ్వర్లు, డాక్టర్ ఉమాకాంత్, చీకోటి సంతోష్, రామారావు, వసంత్‌కుమార్, ఎం.ఐలయ్య తదితరులు పోటీ చేస్తున్నట్లు వారు తెలిపారు.

వైజ్ఞానిక రంగంలో సూరి భగవంతం కీలకపాత్ర

చిక్కడపల్లి: వైజ్ఞానిక రంగంలో డాక్టర్ సూరి భగవంతం కీలకపాత్ర పోషించారని బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం సాయంత్రం త్యాగరాయగానసభలో డాక్టర్ సూరి భగవంతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గానసభ సౌజన్యంతో కేంద్ర మాజీ సైంటిఫిక్ అడ్వైజర్ డాక్టర్ సూరి భగవంతం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో డీఆర్‌డీఓ స్థాపనకు ఆయన ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. తెలుగుజాతికి వన్నెతెచ్చిన మహనీయుడని, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా పనిచేసి శాస్త్ర పరిశోధనలకు ప్రోత్సాహాన్ని అందించారన్నారు. న్యూ ఎరా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఇస్రో శాస్త్రవేత్త మహేంద్రనాథ్‌లకు భగవంతం ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. సీనియర్ పాత్రికేయుడు వల్లీశ్వర్, ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎస్‌బీ.రామ్, చైర్మన్ డాక్టర్ సీఎస్.ఆర్ ప్రభు, విశ్రాంత సైనికాధికారి శ్రీనివాస్ తదితరులున్నారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి


ఆందోళన చేస్తున్న ఎస్‌వీఈఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.5,500 కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు మంద నవీన్, నాగరాజులు డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని ఎస్‌వీఈఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు తరగతులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఫీజు రియంబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. చదువు పూర్తిచేసుకున్న విద్యార్థుల సర్టిఫికెట్లు యాజమాన్యం ఇవ్వడం లేదని ఫీజు మొత్తం చెల్లించి సర్టిఫికెట్లను తీసుకెళ్లాలని విద్యా సంస్థల యాజమాన్యాలు అనడంతో విద్యార్థులు డబ్బులు చెల్లించలేక సర్టిఫికెట్లను తీసుకోలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఉన్నత చదువుకు దూరం అవుతున్నారని ప్రభుత్వం ఆలోచించి వెంటనే ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీడీఎస్‌యూ సెంట్రల్ జోన్ అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి తీగల శ్యామ్, శిరీష, శ్రవంతి, సునీత, మాధవి, శ్రీదేవి, రమేష్, విజయ్, సలీమ్, వేణు, గణేష్, నరేందర్ తదితరులున్నారు.

24వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలి

డీఎస్సీని వాయిదా వేయాలని
ఆర్.కృష్ణయ్య డిమాండ్


మాట్లాడుతున్న రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిన సందర్భంగా డీఎస్సీని వాయిదా వేయాలని, 24 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో నిర్వహించిన నిరుద్యోగుల జేఏసీ చైర్మన్ నీల వెంకటేష్, గుజ్జ కృష్ణ నాయకత్వంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదు వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తామని విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రకటించారని వాస్తవానికి 24 వేలకు పైగా ఖాళీలు ఉంటే ఐదు వేలు ఎలా భర్తీ చేస్తారని ఆయన ప్రశ్నించారు. 2022 మార్చిలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో సీఎం కేసీఆర్ విద్యా శాఖ పరిధిలో 13,086 టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేస్తామని చెప్పి మర్చిపోయారన్నారు. మొత్తం 23,065 పోస్టుల భర్తీకి ఆర్థికశాఖ అనుమతి ఇవ్వాలన్నారు. కోలా జనార్దన్, రాజేందర్, అనంతయ్య, వేముల రామకృష్ణ, శివకృష్ణ, మల్లేష్‌యాదవ్, రాందేవ్, ఎం.నిరంజన్ తదితరులున్నారు.

అనాథలకు 'అన్నపూర్ణ' డొక్కా సీతమ్మ


నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా, శంకరనారాయణ తదితరులు

చిక్కడపల్లి: మదర్ థెరిసా సేవలను మనమంతా కొనియాడుతామని, మన తెలుగు జాతిలో డొక్కా సీతమ్మ త్యాగ నిరతి గురించి కొద్దిమందికే తెలియడం బాధాకరమని ఉప్పల శ్రీనివాస్ గుప్తా ఆవేదన వ్యక్తం చేశారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో శుక్రవారం 'శతాబ్ది పూర్వ మహనీయులు' కార్యక్రమంలో భాగంగా డొక్కా సీతమ్మ సంస్మరణ సమావేశం జరిగితంది. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. అనాథల పాలిట అన్నపూర్ణగా డొక్కా సీతమ్మ గోదావరి జిల్లాలలో వేలాది మంది ఆకలిబాధను తీర్చేవారని గుర్తు చేశారు. సీనియర్ జర్నలిస్టు, హాస్యవధాని శంకరనారాయణ మాట్లాడుతూ.. అన్నార్తుల కోసం తన సంపదనంతా ధారపోసిన పుణ్యాత్మురాలు సీతమ్మ నేటి తరాలకు తెలియకపోవడం బాధాకరమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షత వహించిన వేదికపై వైఎస్ఆర్‌మూర్తి, శ్రీమణిలు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఆహ్వానపత్రిక ఆవిష్కరణ


ఆహ్వానపత్రికను విడుదల చేస్తున్న చైర్మన్ గౌతంకుమార్‌పటేల్

ముషీరాబాద్: లోయర్ ట్యాంక్‌బండ్ కనకాల కట్టమైసమ్మ దేవాలయంలో రేపటి నుంచి 23 వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ గౌతంకుమార్ పటేల్ ప్రకటించారు. శుక్రవారం ఆలయంలో గౌతంకుమార్, దేవాలయ ఈఓ వీఎస్‌వీ సత్యనారాయణ, ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మతో కలిసి ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఎంతో ప్రాధాన్యత కలిగిన దేవస్థానమని ఆలయంలో ప్రతి ఏటా విశేషంగా జరిగే ఈ ఉత్సవాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. నవరాత్రి ఉత్సవాలలో ఈనెల 15న ప్రారంభమయ్యే ఉత్సవాల్లో అమ్మవారికి ప్రతిరోజూ పంచామృత అభిషేకంతో ప్రారంభమై విశేషాలంకరణ, ప్రత్యేక పూజలు, సహస్రనామార్చనలు, చండీ హోమం, అన్నప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్చకులు రాజీవ్‌శర్మ, ఆలయ సిబ్బంది సత్యనారాయణ తదితరులున్నారు.

కరపత్రం ఆవిష్కరణ..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి తొమ్మిది రోజుల పాటు చిక్కడపల్లిలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్ పలున బాలరాజుగౌడ్, అసోసియేషన్ అధ్యక్షులు కందూరి కృష్ణ, వందన రాజగోపాల్, వికాస్‌చంద, వల్లభ, పి.హరీష్‌గుప్తా, అనిల్‌కుమార్, శరత్‌గుప్తా, చంద్రమోహన్, శివకృష్ణ తదితరులున్నారు.

అంబర్‌పేట్ మహంకాళి ఆలయంలో..

అంబర్‌పేట్: ఈనెల 15వ తేదీ నుంచి అంబర్‌పేట మహంకాళి దేవాలయంలో ఘనంగా శరన్నవరాత్రులు వేడుకలను నిర్వహించనున్నట్లు అంబర్‌పేట దేవస్థాన సేవ సమితి ప్రతినిధులు ప్రకటించారు. 15న అమ్మవారు బాల త్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీదేవి, 17న మంగళగౌరిదేవి, 18న అన్నపూర్ణ దేవి, 19న లలిత త్రిపుర సుందరీ దేవి, 20న సరస్వతీదేవి, 21న మహాలక్ష్మి దేవి, 22న దుర్గాదేవి, 23న (ఉదయం) మహిషాసుర మర్దినిదేవి, సాయంత్రం రాజరాజేశ్వరి దేవి అలంకరణల్లో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నారు. 21న అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్‌లో దండియా కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించడం జరుగుతుందని, 22న సద్దుల బతుకమ్మ నిర్వహిస్తామన్నారు.

గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలి


మాట్లాడుతున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

- సర్వే ప్రకారమే అధిష్టానం నిర్ణయం
- కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన కిషన్‌రెడ్డి, లక్ష్మణ్

జంగ్ తెలంగాణ 2023

ముషీరాబాద్: వచ్చే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించి అధికార పగ్గాలు చేపట్టడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరిస్తూ.. వారిని చైతన్యం చేయాలన్నా రు. శక్తి కేంద్రాలు, పన్నా ప్రముఖులు, బూత్‌కమి టీ నాయకులు గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు.

క్రమ శిక్షణ తప్పితే కఠిన చర్యలు..

బీజేపీ అభ్యర్థుల ఎంపికపై మీడియాలో వచ్చే కథనాలను నమ్మొద్దని రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. పార్టీ అధిష్టానం సర్వేల ఆధారంగా ఎవరికి టికెట్ కేటాయించాలో నిర్ణయిస్తుందన్నారు. కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, పార్టీ క్రమశిక్షణ రాహిత్యానికి పాలుపడితే సహించేది లేదన్నారు.

- సమావేశానికి నియోజకవర్గం బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏదో ఒకరి పేరు చెప్పి తీపి కబురు అందిస్తారని ఆశించిన ఆశావాహులకు నిరాశే ఎదురైనట్లు సమాచారం. టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 30 మందికి పైగా దరఖాస్తుదారులు, పార్టీ సీనియర్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు అధిక సంఖ్యలో హాజరై ఏదో ఒక విషయం స్పష్టం చేస్తారని ఆశతో ఎదురు చూసిన పార్టీ నేతలు ఏ విషయం చెప్పకపోవడంతో నిరాశ చెందిన ట్లు తెలుస్తోంది. ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ ఎన్నికల ఇన్‌చార్జ్ విశ్వనాథ్, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్, కార్పొరేటర్లు కె.రవిచారి, సుప్రియానవీన్‌గౌడ్, పావనీవినయ్‌కుమార్, రచనశ్రీ, అసెంబ్లీ కన్వీనర్ రమేష్‌రామ్, సీనియర్ నాయకులు సీ.కే.శంకర్, బండారు విజయలక్ష్మి, జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, పూస రాజు, భరత్‌గౌడ్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో యువతకు అవకాశం కల్పించండి

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ యువతకు టికెట్లు కేటాయించాలని ఆ పార్టీ నేత మర్రి దుర్గేష్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆ పార్టీ నేతలు నచికేత్ శాస్త్రి, ఎర్ర రమేష్, తాటిపల్లి చంద్రశేఖర్‌లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. అచ్చంపేట అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తనకు టికెట్ కేటాయించాలని కోరారు. టికెట్ ఇవ్వకపోతే రెబల్‌గా పోటీ చేస్తానన్నారు. తన పూర్వీకుల నుంచి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీని వీడి వేరే పార్టీలోకి వెళ్లడం ఇష్టంలేక పార్టీపై ఉన్న అభిమానంతో రెబల్ అభ్యర్థిగా పోటీచేసి గెలిచి కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీకి బహుమతిగా అందజేస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 70 మందికిపైగా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ టికెట్లు రాక రెబల్ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారని అభిప్రాయపడ్డారు. యువ నాయకత్వాన్ని గుర్తించి టికెట్లు కేటాయించాలని పార్టీ అధిష్టానానికి ఆయన విజ్ఞప్తి చేశారు.

వడ్డెరలకు రెండు అసెంబ్లీ సీట్లు ..


వేముల వెంకటేశం

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల్లో వడ్డెరలకు అత్యధిక జనాభా కలిగిన కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి టికెట్లు కేటాయించాలని ఆల్ ఇండియా వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల వెంకటేశం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. కుత్బుల్లాపూర్‌లో 35 లక్షల వడ్డెర జనాభా ఉందని, శేరిలింగంపల్లిలో 40లక్షలు ఉందన్నారు. కుత్బుల్లాపూర్ నుంచి గుంజ శ్రీనివాస్, శేరిలింగంపల్లి నుంచి జైపాల్‌కు కాంగ్రెస్ పార్టీ తరపున టికెట్లు కేటాయిస్తే వారిని వడ్డెర సంఘం ఆధ్వర్యంలో గెలిపించుకుంటామన్నారు. వడ్డెరలను గుర్తించి రెండు టికెట్లు కేటాయిస్తే రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెరలంతా కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తారని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఈ రెండు నియోజకవర్గాల నుంచి టికెట్ కోసం వారు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వడ్డెరలు రాజకీయంగా ఎదగడానికి కాంగ్రెస్ అధిష్టానం అవకాశం కల్పించాలని కోరారు.

అరెకటికలకు ఒక సీటు కేటాయించాలి..


ఎస్.గోపాల్‌రావు


కాచిగూడ: రాష్ట్రంలో 25 లక్షలకు పైగా జనాభా ఉన్న అరెకటికలను గుర్తించి అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు ఒక సీటు కేటాయించాలని అరెకటిక సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం కాచిగూడ, నింబోలిఅడ్డలోని అరెకటిక భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అరెకటికలు రాజకీయంగా ఎదగకుండా అడ్డుకుంటున్నారని, కేవలం అరెకటికలను ఓటు బ్యాంకుగా చేసుకుని రాజకీయ పార్టీలు వాడుకుంటున్నాయన్నారు. కేంద్రంలో తమ కులానికి చెందిన ముగ్గురు మంత్రులు ఉన్నారని, వివిధ రాష్ట్రాల్లో మంత్రులు, పార్టీల్లో ప్రధాన పోస్టుల్లో అరెకటికలు ఉన్నారని, కానీ తెలంగాణలో మాత్రం రాజకీయ పార్టీలు అరెకటికలను గుర్తించడం లేదన్నారు. అరెకటికలను గుర్తించి సీట్లు కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని, విస్మరించిన పార్టీలను ఓడిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం జీహెచ్ఎంసీలో ఒక కార్పొరేటర్ కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలి


మాట్లాడుతున్న మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు సునీల్‌మాదిగ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్ని రాజకీయ పార్టీలు తాము అధికారంలోకి వస్తే మాదిగలకు ఏమి చేస్తారో తెలుపుతూ మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు రేగుంట సునీల్‌మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలను విస్మరించే పార్టీలకు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు మాదిగలకు 13 సీట్లు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ తరహాలో తెలంగాణలో కూడా మాదిగలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంలో స్పష్టమైన హామీతో పాటు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలుకటి జనార్దన్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ జనార్దన్, వెంకటరమణ, రవికుమార్, ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్, ఎస్సీ ఉపకులాల అధ్యక్షులు రాజలింగం, దుర్గారాజ్, నారాయణ, రోజారాణి, లావణ్య, చింతల రాజలింగం, దుర్గా తదితరులున్నారు.

15న ముషీరాబాద్‌కు కేంద్రమంత్రి



ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వం గంగపుత్రులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సాధ్వి నిరంజన జ్యోతి ఈనెల 15న ముషీరాబాద్‌కు వస్తున్నారని బీజేపీకి చెందిన గంగపుత్ర సంఘం నాయకులు సీ.కె.శంకర్, పూస రాజు, మెట్టు వాసు, బిజ్జి కనకేష్, రమేష్ గంగపుత్రులు శుక్రవారం రాంనగర్‌లో ప్రకటించారు. ఈ నెల 15న ఉదయం 11.30 గంటలకు ముషీరాబాద్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గంగపుత్రులందరితో కలిసి ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఎంపీగా ఉన్న ఆమె గంగపుత్ర కమ్యూనిటీకి చెందిన వారేనని వివరించారు. ఈ అవగాహన సదస్సుకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని గంగపుత్రులందరు హాజరుకావాలని కేంద్ర ప్రభుత్వం గంగపుత్రులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

కేజీబీవీ ఉద్యోగుల సమస్యలపై అన్ని పార్టీలు స్పందించాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్, వర్కర్స్‌కు మినిమమ్ టైమ్‌స్కేల్ వేతనాన్ని బేసిక్‌ను నిర్ణయించాలని ప్రగతిశీల కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల నాన్‌టీచింగ్, వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.ఎల్.పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎన్నికల మ్యానిఫెస్టోలో అన్ని పార్టీలు తమ వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సుమారు 8 వేల మంది పనిచేస్తున్న సిబ్బందిని రెగ్యులరైజ్ చేసి బాలికల విద్య, అనాధ బాలలకు, ఆంగ్ల మాధ్యమంలో చదివే బాలికలకు తోడ్పడాలని కోరారు. అందరికీ మెడికల్ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఉద్యోగ భద్రత, మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలని కోరారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, అరుణ్‌కుమార్, అశోక్, సాంబశివుడు, కేజీబీవీ మోడల్ స్కూల్ నాయకులు కావేరి, సునీత, బాలమణి, లక్ష్మి, నాగలక్ష్మి, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.